

# క రాజు కథలు

## - సింగీతం శ్రీనివాసరావు



## నా మాట

అప్పుడెప్పుడో - కాలేజీల కాలం. ఖాసా సుబ్బారావుగారు, గోరా శాస్త్రిగార్ల ప్రోత్సాహంతో భారతి, స్వతంత్రలాంటి పత్రికల్లో కొంతకాలం నా రచనా కేళి సాగింది. ఆనాడు రాసిన "అంత్యఘట్టం" నాటికను ఇప్పుడు కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయంలాంటి చోట్ల ప్రదర్శిస్తున్నారంటే అదో తృప్తి. ఆ రోజుల్లోనే టంగుటూరి సూర్యకుమారిగారు నటించి, ప్రదర్శించిన 'చిత్రార్జున' నాటకం పాటలతో సహా రాశాను. ఈ ప్రదర్శనను పండిత జవహర్ లాల్ నెహ్రూగారు ఢిల్లీలో చూశారు. ఆ తర్వాత టామ్ బకన్ అనే స్కాట్లండ్ రచయిత దీనిని ఇంగ్లీషులో తర్జుమా చేస్తే, దీన్ని అమెరికాలో తెలుగు పాటలతో ప్రదర్శించారు. ఈ తర్వాత నేను పెద్దగా రాసిందేది లేదు. "మీ సినిమాలకి మీరే మాటలు రాస్తే బాగుంటుంది" అని జంధ్యాలగారు చాలాసార్లు చెప్పారు. ఆయన మాటల్ని కాదనలేక పుష్పక విమానం తీశాను. "మీరు పాటలు రాయండి" అంటూ వేటూరిగారు ఎప్పుడూ ప్రోత్సహిస్తూ వుండేవారు. 'భైరవద్వీపం'లో ఒకపాట ఆయన రాయాల్సుంది. ఎన్నాళ్ళకూ ఆయన దర్శనం లభించకపోయేసరికి గత్యంతరం లేక నేనే "విరిసినది వసంతగానం" పాట రాశాను. ఆ పాట బాగా రాశానని వేటూరిగారు మెచ్చుకోవడం నాకొచ్చిన పెద్ద అవార్డు.

మళ్ళీ ఇన్నాళ్ళకు కాలేజి రోజుల ఉత్సాహం మళ్ళీ పుట్టుకొచ్చింది. ఆ రోజుల్లో పింగళి నాగేంద్రరావుగారు నా చేత స్క్రిప్టు ఒక రఫ్ వర్షన్ సీన్లు రాయించేవారు. వాటిల్లోంచి ఎన్నో ఐడియాలూ, శ్రీకృష్ణార్జునయుద్ధంలో అర్జునుడి పేరు 'అజిభీధఫపావిశ్వేసకి' లాంటివి ఎన్నో వచ్చేవి. ఇంట్లో వాటిని ఫెయిర్ కాపీ చేసే పని నా అర్ధాంగి కల్యాణిది. మళ్ళీ ఆ రోజులు గుర్తొచ్చేలా ఈ కథల్ని కల్యాణే ఫెయిర్ కాపీ చేసింది. ఈ కథల్ని ఆనందిస్తూ - "ఎంజాయ్" చేస్తూ అంటే కరెక్ట్‌గా చెప్పామనిపిస్తుంది - రాశాను. చదివిన వాళ్ళూ ఎంతో కొంత ఎంజాయ్ చేస్తే మరింత ఆనందిస్తాను.

*సింగీతం శ్రీనివాసరావు*

మిత్రులు సింగీతం శ్రీనివాసరావుగారికి నాకూ కనీసం 50 ఏళ్ళ పరిచయం. ఆయన భారతికి 'అంత్యఘట్టం' రాసే రోజుల్లో నేనూ భారతికి రాస్తున్నాను. దరిమిలాను ఆయన సినిమా రంగంలో స్థిరపడిన తర్వాత యిద్దరం కలిసి చాలా సినిమాల్లో పనిచేశాం. ఆయన దర్శకత్వం, వహించిన సినిమాలకు నేను రచన చేశాను. ఆయన దర్శకత్వంలో నేను నటుడిగా పనిచేశాను. ఈ రెండూ చెయ్యకపోయినా ఆయన తీసే అన్ని సినిమాల కథలూ ముందుగా నాకు చెప్పి నాతో చర్చించడం ఒక ఆనవాయితీ. నాకు వారి నాన్నగారు రామచంద్రరావుగారు తెలుసు. ఈ విషయాన్ని ఇంత విపులంగా, ముందు చెప్పడానికి కారణం - ఆయన సెన్సాఫ్ హ్యూమర్‌తో నాకు అయిదు దశాబ్దాల బంధుత్వం ఉన్నదని చెప్పడానికి.

'ఆదిత్య 369'లో నేను, టినూ ఆనంద్, అమ్రేష్‌పురీ నటిస్తున్నాం. మరొకరెవరో గుర్తులేదు. వాళ్ళ చెవులకి వైర్లు బిగించి - భయంకరంగా వయొలిన్లు వాయించే ఏర్పాట్లు చేశారు. ఆ శబ్దాలకి వారి చెవుల్లోంచి రక్తం కారుతుంది. నా చేత ఒక డైలాగ్ చెప్పించారు శ్రీనివాసరావుగారు. నా బాస్ అమ్రేష్‌పురీతో అంటాను. "బాస్, మీరు చాలా గొప్పవారు. వయోలిన్స్ ద్వారా అద్భుతమైన 'వయొలెన్స్'ని సృష్టించగలుగుతున్నారు" అని. ఇది ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా గిలిగింతలు పెట్టినట్టు నవ్వుకుంటాను.

శ్రీనివాసరావుగారు రాసిన కథల్ని చదవడం ఇదే మొదటిసారి. చదివాక - మొదట నిర్ఘాంతపోయాను. కారణం మెల్లగా చెబుతాను. అవి చిన్నపిల్లల కథల్లాగ అతి సరళంగా, అమాయకంగా చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న పసివాడిలాగా నడిపించుకుపోయాయి. మంచి కథకి అది మొదటి, గొప్ప లక్షణం.

కాగా, మంచి భాష నేర్పేవాడు భాష శాస్త్రికావడం, బాగా పాడేవాడు తాలం బ్రహ్మయ్య, శివ భక్తుడు కాశీ విశ్వేశ్వరయ్య కావడం, దుర్మార్గులు కోరమీసాల కోటయ్య, మిడిగుడ్ల సిద్ధయ్య కావడం - యివన్నీ చిన్నపిల్లల కథలకి ఏమి తికమకలు లేని Stylisation. ఇక్కడితో ఈ కథలకి సంబంధించిన చిన్నపిల్లల ముద్ర ఆగిపోతుంది. చదివించే గొప్ప గుణాన్ని వాక్యాల, పేర్ల సన్నివేశాలతో సాధించారని చెప్పడమే నా ఉద్దేశం. అయితే వీటికి కేవలం చదివించే గుణం మాత్రమే ఉన్నదని సరిపెట్టుకోవడానికి వీలులేదు. లోకధర్మాన్నీ, లోకం తీరునీ, సమాజ స్వరూపాన్నీ అతి సునిశితంగా, కాని సున్నితంగా వెక్కిరించే - అది కేవలం వెక్కిరింత మాత్రమే కాదని అనిపించే సెన్సాఫ్ హ్యూమర్‌ని జతచేశారు. అదీ ఈ కథల్లో రచయిత సాధించినది.

సరళంగా చదివించి, సరసంగా నవ్వించి, 'అమ్మో!' అని తుళ్ళిపడేటట్టు చేసి సమాజంలోని వైపరీత్యానికి కనుబొమ్మలు ముడివేయడమో, కత్తులు నూరడమోకాక, నవ్వుతూ గాటుపెట్టే అందమయిన ఆయుధాన్ని సానబెట్టారు రచయిత ఈ కథల్లో. ఈ ధోరణిలో మార్క్‌ట్వెయిన్, భమిడిపాటి కామేశ్వరరావు వంటి రచయితల్ని స్ఫురణకు తెస్తారు రచయిత. అసలు ఏ రచయితయినా సమాజంలో అవకతవకల్ని చూసి కళ్ళెర్రజేయడం అతని పరిధిని దాటడం అనిపిస్తుంది నాకు. కానీ వ్యగ్రతల్ని చూపి నవ్విస్తూ వాటిని పాఠకుడి స్పృహలోకి తీసుకురావడం రచయిత పరిమితిగా నేను నమ్ముతాను. No Social Problem can be solved by any writer on paper. He can only create the consciousness. హాస్యం ఆ అపశ్రుతిని ఫోకస్‌లోకి తెస్తుంది. ఆలోచించేట్టు చేస్తుంది. అంతవరకే రచయిత పని. తరువాత ఏ పనిని చేపట్టినా అది తనదికాని పనిని నెత్తిన వేసుకోవడమే అవుతుంది.

కొట్టండి చంపండి అనేవాడికంటే, అవినీతిని నవ్వుతూ అలంకరించి, కితకితలు పెట్టే రచయిత మంచి హెచ్చరికని చేయగలుగుతాడని నేను నమ్ముతాను. ఆ పనిని చాలా బాధ్యతగా, గంభీరంగా, ప్రొఫెషనల్‌గా, తనకి వారసత్వంగా వచ్చిన సెన్సాఫ్ హ్యూమర్‌తో ప్రతీ కథలోనూ చేసి చూపించారు.

హాస్యానికి అద్భుతమైన పదును ధ్వని. కేవలం నవ్వించే హాస్యం - వెకిలిగానూ, కొండకచో వెగటుగానూ ఉండవచ్చు. కానీ సమాజశీలాన్ని చిన్న గాటుతో ఉలిక్కిపడేటట్టు చేయడం ఆరోగ్యకరమైన ఉత్తమ హాస్యం లక్షణం. వెకిలి 'ధ్వనుల'ను రాబట్టే చాలామంది రచయితలు మనకున్నారు. అర్థంలేని 'పన్'లను వాడి కంపు కొట్టించే ఘనులున్నారు. నాకు వీరందరి మధ్యా సింగీతం ప్రత్యేకంగా, విభిన్నంగా దర్శనమిస్తారు. ఈ మాట చెప్తున్నప్పుడు నా మనస్సులో మార్క్‌ట్వెయిన్ ఉన్నారు.

ఆయన ఎప్పుడో ఇండియా వచ్చారట. దక్షిణాదిన చాకలి బండమీద బట్టలు ఉతకడం చూశారట. "ఆహా! ఒక్క భారతదేశంలోనే బట్టల్తో బండల్ని బద్దలు కొట్టే విచిత్రాన్ని చూశాను" అన్నారట.

హాస్యానికి వింతకోణం, సంధించగలిగితే వింత పదునూ, సమర్థుడి చేతుల్లో వింత అస్త్రమూ కాగలదు. ఈ పనులన్నీ చేయగల నిష్ణాతుడు సింగీతం శ్రీనివాసరావు. చేసి చూపిన వేదిక - "క రాజు కథలు."

*గొల్లపూడి మారుతీరావు.*

# చిలుక పలుకులు

**క రాజు** రాజ్యంలో చాలా ఏళ్ళుగా చెంచయ్య అనే వ్యక్తి పశువుల వ్యాపారం చేస్తున్నాడు. సంతకి వెళ్ళడం కంటే చెంచయ్య దగ్గరైతే మేలురకం గేదెలు, ఆవులు గొఱ్ఱెలు దొరుకుతాయని అందరి నమ్మకం. కొన్నాళ్ళుగా ఈ వ్యాపారంలోకి మరికొందరు దిగారు.

ఇతర దేశాల పశుసంపదను ఈ ఊరికి తెచ్చేసరికి జనం కొద్దిగా ఆ వైపుకి మోజు కనబర్చారు. దాంతో చెంచయ్య వ్యాపారం కొంత సన్నగిల్లడంతో ఇప్పుడేం చెయ్యాలా అని అనుకుంటూంటే అతనికో ఆలోచన తట్టింది.

కొండనానుకుని ఉన్న అడవిలో "చిలుకల గుబురు" అనే ప్రాంతం వుంది. అక్కడున్న చెట్లమీద కొన్నివేల చిలుకలు నివాసం చేస్తున్నాయి. ఇప్పుడా చిలుకలను వలవేసి పట్టి అమ్మితే పశువులకన్నా మెరుగైన లాభాలు వస్తాయని నిశ్చయించాడు చెంచయ్య.

వెంటనే అనుచరులతో అడివికెళ్ళి రెండురోజుల ప్రయత్నంతో కొన్ని చిలుకలను పట్టాడు.

కానీ తీరా ఇంటికొచ్చి వాటిని అమ్మకానికి పెట్టేసరికి అనుకున్న రీతిన కొనడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. చిలుకలను ఇంట్లో పెంచడం మంచిదికాదనీ, ఒకప్పుడు ఇలా చేసే రామదాసు కారాగార శిక్ష అనుభవించాడనీ ఇలాంటి కథలతో చిలుకలను కొనడానికి అందరూ భయపడ్డారు.

మరి వీటిని అమ్మడమెలాగని ఆలోచించగా అతనికి మరో ఆలోచన వచ్చింది. చిలుకలకు మాటలు నేర్పితే ఆ ముచ్చట కోసం వాటిని కొనడానికి జనం సమ్మతించవచ్చు. అయితే ఎటువంటి మాటలు నేర్పాలి? అందరూ ఎటువంటి మాటల్ని వినడానికి ఇష్టపడతారు? చెంచయ్యకు మెరుపులా తట్టింది. అందరూ ఇష్టపడే మాట ఒక్కటే - పొగడ్త. ఈ చిలుకలకు పొగిడే మాటలు నేర్పిస్తే అందరూ విరుచుకుపడి కొంటారనే దృఢ నమ్మకం కుదిరింది.

ముందు "ఆహా!", "ఓహో", "భలే" అనే చిన్నచిన్న మాటలు నేర్పాడు. ఆ తర్వాత "నీవే ఘనుడవు" - "నిన్ను మించిన వాడులేడు" అనే మాటలను నేర్పాడు. చిలుకలకిచ్చిన శిక్షణ పూర్తికాగానే ఒకరోజు ఊరివారనంతా ఆహ్వానించి తాను కొత్తగా అమ్మదలచుకున్న మాటల చిలుకల్ని చూపెట్టాడు. ఇది చూసిన జనం ఆశ్చర్యంతో ఇలాంటి చిలుకనొక దాన్నైనా తమ ఇంట్లో ఉంచుకోవాలని ఉబలాటపడ్డారు. అదివరకు విన్న రామదాసు కథల్ని పక్కకు నెట్టేశారు. ఒక్కొక్కరు ఎక్కువ వెలనిచ్చి చిలుకల్ని కొన్నారు.

ఇలా కొన్నవాళ్ళలో ఆస్థానకవి కాడానికి ప్రయత్నించే కవి ఒకడు ఉన్నాడు. అంతకు ముందు అతను ఏ కావ్యం రాసి వినిపించినా విన్న తోటికవులు పెదవి విరిచేవారు. ఇది వారి ఈర్ష్య అని అతను తృప్తి పడేవాడు. అయినా అతన్నెవ్వరూ మెచ్చుకోలేదన్న బాధ అతనికి మనశ్శాంతి లేకుండా చేసింది. ఇప్పుడు అతను ఒక మాటల చిలుకను కొన్నాడు. అప్పట్నుంచి అతని ఆనందమే వేరు. అతను రాసిన ఒక పద్యపాదం చదవగానే ఎదురుగా వున్న చిలుక "ఆహా!" అనేది. పద్యం పూర్తి కాగానే "భలే" అనేది. "నీ అంతటి ఘనుడులేడు" అనేది, మురిసిపోయిన ఆ కవి తను ఆకల్తో వున్నా చిలుకకు మాత్రం జామపళ్ళు, దానిమ్మ గింజలు పెట్టేవాడు.

ఇలా సంగీత కళాకారులు, నటులూ, వ్యాపారస్థులూ, ప్రభుత్వోద్యోగులూ - ఒకరేంటి? ఎందరో ఈ చిలుకల్ని కొని రోజూ వాటి పొగడ్తల ఆనందంలో మునిగిపోయేవారు.

ఈ వ్యాపారం చేస్తూనే చెంచయ్య మరొక చిన్నపని చేశాడు. చిలుకలకు రోజూ పొగడ్తలు నేర్పినేర్పి విసుగుపుట్టి ఒకరోజు సరదాగా ఒక చిలుకకు తిట్లు నేర్పడం మొదలెట్టాడు. "ఛీఛీ", 'నీచుడా, 'ఛండాలుడా', 'ఎంతటి అఘాయిత్యం చేశావురా' లాంటి పదాల్ని. పొగడ్తల కన్నా తిట్లు తొందరగా నేర్చుకుంది చిలుక.

ఇంకో విశేషమేమిటంటే, పొగడ్తల విషయంలో ఒక్కొక్క చిలుకకు ప్రత్యేకంగా పాఠం చెప్పాల్సివచ్చేది. అదే తిట్టైతే ఒక చిలుకకు చెప్తేచాలు పక్కనున్న చిలుకలు వాటంతటవే ఆ తిట్లను నేర్చుకునేవి. రెండు వారాల్లో ఐదారు తిట్లు తిట్టే చిలుకలు తన దగ్గరుండటం చూసి చెంచయ్యకే ఆశ్చర్యం వేసింది. వీటిని చూసి పొగిడే చిలకల్ని కొనేవాళ్ళు కూడా రారేమో నన్న భయంవేసి వాటిని పెరట్లో దూరంగా ఉంచాడు. అప్పుడప్పుడు ఎవరికైనా తిట్టే చిలుకలు కావాలా అని అడగడం కూడా జరిగింది. కానీ వాటిని కొనడానికి ఎవరూ ఇష్టపడరని గ్రహించాడు.

ఒకనాడు ఒక తీపి మిఠాయిల దుకాణం ప్రారంభోత్సవానికి మంత్రి బజారుకు సపరివారంగా రావడం జరిగింది. ఈ సందర్భంలో దగ్గర్లోనే వున్న మాట్లాడే చిలుకల దుకాణం గురించి విని వాటిని చూడాలనే కుతూహలంతో మంత్రి అక్కడికి వెళ్ళాడు. అనుకోకుండా వచ్చిన మంత్రిగారిని చెంచయ్య సాదరంగా ఆహ్వానించి, తన దగ్గరవున్న పొగిడే చిలకల్ని చూపించి వాటిలో ఒకదానిని మంత్రిగారికి గౌరవ మర్యాదలతో బహూకరించాడు. ఇదే సమయంలో దూరంగా పెరట్లోంచి తిట్లు వినిపించేసరికి చెంచయ్య వాటిని గురించి చెప్పక తప్పిందికాదు. ఇది చూసిన మంత్రి చెంచయ్యకు ఒక సలహా ఇవ్వాలనుకున్నాడు.

"చెంచయ్యా! ఆ చిలుకల్ని వదిలేస్తే పోలా" అన్నాడు మంత్రి.

"అమ్మబాబోయ్ వద్దండీ వద్దు" అన్నాడు చెంచయ్య కంగారుగా. "ఒకసారి ఒక చిలుక పంజరంలోంచి తప్పించుకునిపోయి, ఊళ్ళోకెళ్ళి ఇళ్ళకప్పులమీద, వీధుల్లో చెట్లమీద కూర్చుని వచ్చేపోయేవారిని తిట్టూంటుంది. దాంతో అందరూ నా యింటిని చుట్టిముట్టి నన్ను చావబాది పోయారు. నేనే ఎలాగో తప్పించుకున్న చిలుకను పట్టి మళ్ళీ గూట్లో పెట్టేశాను."

ఈ మాటలు విన్న మంత్రికి మరొక ఆలోచన తట్టింది.

"చెంచయ్యా! మన నగరంలోని మంచోళ్ళ పేట ఎరిగున్నావ్ కదా?" అడిగాడు మంత్రి.

"అవును మంత్రి ప్రభూ! అక్కడున్న వారు పేట విడిచి బయటికి రారు."

"అవును. మంచోళ్ళ పేట అంటే మంచి మనుష్యులు వుండే పేట. ఆ పేటకు ఆ పేరు ఎందుకు వచ్చిందో తెలుసుగా! రాజ్యంలో రకరకాల నేరాలు చేసినా వారు శిక్షలను అనుభవించిన తర్వాత ఊళ్ళో వాళ్ళకు ముఖాలు చూపించుకోడానికి ఇష్టపడరు. ఒక్కసారి వచ్చిన చెడ్డపేరు వారిని ఎక్కడా తలెత్తనీయకుండా చేస్తుంది. అలాంటి వాళ్ళంతా చేరి ఊరి చివర్న నివాసం ఏర్పరుచుకున్నారు, అదే మంచివాళ్ళపేట. ఇప్పుడు నీవీ చిలుకల్ని వాళ్ళకు కానుకగా పంపిస్తే సరిపోతుంది. అక్కడివారు నేరస్థులు కనుక తిట్లను తప్పుపట్టరు."

మంత్రి ఆలోచన చెంచయ్యకు ఒకరకమైన ఊరట కలిగించింది. తిట్టే చిలుకల్ని వదిలించుకోడానికి ఇదొక సదవకాశమైంది. వెంటనే తన దగ్గరున్న చిలుకల్ని మంచోళ్ళ పేటకు తీసుకువెళ్ళి అక్కడివాళ్ళకు కానుకగా ఇచ్చి వచ్చాడు.

తిట్లు విన్నప్పుడు ముందు అందరికీ కాస్త కోపం వచ్చింది. ఇప్పటికే కుమిలిపోతున్న వాళ్ళని ఇంకా క్రుంగదీయడానికి ప్రభుత్వం వారు ఈ పని చేయించారంటూ బాధపడ్డారు. కానీ ఈ బాధ కొన్నాళ్ళవరకే ఉండింది.

చిలుకల తిట్లు రోజూ వింటూ వింటూ కొంతకాలానికి బాగా అలవాటు పడిపోయారు. అంతకు ముందు ఎవరైనా కొద్దిగా నిందించినా బాధపడేవారు యిప్పుడు ఎవరు ఏమనుకున్నా ఛీ అన్నా, తిట్టినా, కొట్టినా ఇసుమంత కూడా చలించని మనస్తత్వాన్ని పొందగలిగారు. ఇక ఎక్కడో మూల దాగుండవలసిన అవసరం పోయింది. అందరూ స్వేచ్ఛగా నగరంలోకి వచ్చి ధీమాగా తిరుగుతున్నారు. పెళ్ళిళ్ళలో కనిపిస్తున్నారు. సభలలో సాక్షాత్కరిస్తున్నారు. ఇప్పుడు వాళ్ళ వైఖరి వేరు. ఎవరు దూషించినా ఒక చిఱునవ్వు నవ్వి ఒక ఘనకార్యం సాధించిన రీతిలో సగర్వంగా చూసేవారు.

ఇప్పుడు ఊరంతా నేరస్థులే, అంతేకాదు కొత్తగా నేరాలు చేయదలిచినవారు ముందు చిలుకల తిట్లు విని, వాటి కలవాటుపడి ఆ తర్వాత నేరం చేసేవారు. న్యాయాధీశులు వారికే శిక్ష విధించినా సంతోషంగా స్వీకరించి, శిక్షాకాలం కాగానే యధావిధి అందరి మధ్యా ఆనందంగా తిరిగేవారు. తను చెంచయ్యకి చెప్పిన ఒక చిన్న సలహా రాజ్యంలో ఇంతటి విపరీతానికి దారి తీస్తుందనుకోలేదు మంత్రి.

కంగారుగా క రాజు దగ్గరకు వెళ్ళి పరిస్థితిని వివరించాడతను. దీనికి పరిష్కార మార్గం చూడవలసిందిగా వేడుకున్నాడు.

"క్లిష్టపరిస్థితి వచ్చింది మంత్రీ! ఒక రాజ్యంలో నేరాలు చేయడం సహజం దానికి వారు శిక్ష అనుభవించడమూ సహజమే. కాని సమాజంలోని వారందరూ  వారిని చిన్నచూపు చూసినపుడు వారు సిగ్గుతో తలదించుకున్నప్పుడే ఆ శిక్షకొక విలువ. ఎప్పుడా సిగ్గేపోయిందో, 'ఎవరేమనుకుంటే నాకేం?' అన్నట్టు వారు నిక్కుతూ తిరుగుతుంటే ఒక శిక్షలకు విలువలేదు. నేరాలకు అదుపు లేదు. ఒక రాజ్యానికి ఇంతకంటే హీనస్థితి ఉండబోదు" అన్నాడు క రాజు.

క రాజే తన అసహాయత్వాన్ని వెల్లడిస్తూంటే ఇక దిక్కెవరు? మంత్రి కంగారుగా మహారాజా! ఎప్పుడూ ఏదో ఒక పరిష్కార మార్గం చూపించే మీరే ఇలాగంటే ఎలా? ఏదైనా ఆలోచించండి" అన్నాడు.

"ఐతే ఇలా చెయ్యండి" అన్నాడు క రాజు. "ఇది చిలుక పలుకులతో వచ్చి అనర్థం కనుక చిలుకపలుకులే దీనికి విరుగుడు. వెంటనే చెంచయ్యని కలిసి చిలుకలకు "బుద్ధిలేనివాణ్ణి పొగుడ్తారు - చేతకానివాణ్ణి తిడ్తారు" అనే కొత్త మాటల్ని నేర్పి ఊళ్ళో వదలమనండి. ఈ మాటలు వినగానే పొగిడించుకునే వాళ్ళంతా తాము బుద్ధిలేనివాళ్ళుగా చూడబడ్తామనే భయంతో పొగడ్తలకు దూరమౌతారు. ఇక నేరస్థుల విషయానికొస్తే, తమను నేరస్తులన్నా వారు పెద్దగా పట్టించుకోరు కానీ చేతకాని వాళ్ళనిపించుకోవడం మాత్రం అస్సలు సహించలేరు. అందుకని తిట్లకు భయపడ్తారు. ఈ ప్రయత్నంలో రాజ్యంలో మార్పు రాగలదు" అన్నాడు క రాజు.

అనతికాలంలో చిలుకల కొత్తమాటలు జనంలో బాగా ప్రచారమయ్యాయి. ఎక్కడైనా ఎవర్నైనా పొగిడితే చాలు అందరూ ఘొల్లుమని నవ్వేవారు. పొగడబడ్డవాడు నిజంగానే బుద్ధిలేనివాడిలా అయోమయంగా చూసేవాడు. ఇక నేరస్థులంటే చాతకాని వాళ్ళనీ, అందుకే వాళ్ళు నేరాలకు దిగుతారనీ ప్రచారం వాళ్ళల్లో పూర్తి మార్పు తెచ్చింది. సంవత్సరం అయ్యేసరికి రాజ్యంలో నేరాల సంఖ్య బాగా తగ్గిపోయింది సరికదా, అయినవాణ్ణి, కానివాణ్ణి పొగిడే సంస్కారం పూర్తిగా తుడుచుకుపోయింది.

*(ఈ కథలన్నీ గతంలో హాసం పత్రికలో ప్రచురించబడ్డాయి. అంతర్జాతీయంగా ఉన్న తెలుగువారందరికి చేరాలన్న ఉద్దేశంతో రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రిస్తున్నాము )*

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments